


# కుక్కతోక

—నడిమింటి జగ్గారావు

"హలో గురూగారూ! ఇవాల్టి స్పాట్ న్యూస్ విన్నారా?" హడావిడిగా నా టేబుల్ దగ్గరకొస్తూ అన్నాడు సూరి. సూరి అంటే సూర్యప్రకాష్. ప్రపంచంలో ఉన్న అన్ని సంగతులూ వాడికే కావాలి. రోజుకొక వార్త మోసుకొస్తాడు వాడు. ఎప్పుడూ ఏదో ఒకటి మాట్లాడుతూ ఉండడం, అక్కడి సంగతులు ఇక్కడా ఇక్కడి సంగతులు అక్కడా బట్వాడా చేయడం వాడి దైనందిన చర్య.

"ఎలాగూ నువ్వు వినిపిస్తావ్ కదా" అన్నాను నేను.

"అవును గురూగారూ, వినిపించకుండా ఎలా ఉండగలను? ఇంతకీ విషయం ఏమిటంటే ఈరోజు మన ఆఫీసుకి ఒకానొక అత్యంత అందమయిన కాండిడేట్ వస్తోంది. మొన్నే అపాయింట్‌మెంట్ ఆర్డర్సు ఇచ్చారుట. మన అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసరు అవధానిగాడు లేడూ— వాడు చెప్పాట్ట. ఇవాళ మంచిరోజు యీరోజు జాయిన్ అవమని. లేకపోతే మొన్ననే జాయిన్ అయిపోవలసింది. ఛ, ఛ యీ నామాలుగాడివల్ల ఆ అందాన్ని తనివితీరా చూసుకునే భాగ్యం రెండురోజులు ఆలస్యం అయిపోయింది". తెగ బాధపడిపోతూ అన్నాడు సూరి.

"అందుకా ఇవాళ అయ్యగారు ఇంత స్మార్ట్‌గా తయారయ్యారు! ఒరే నువ్వెన్ని చెయ్యి, ఆ ఒచ్చే అమ్మాయెవరోకాని నిన్ను చూసి ఛస్తే నీతో స్నేహం చెయ్యదు"— వాడిని ఉడికిస్తూ అన్నాను నేను.

"ప్రయత్నం భాయీ సాబ్, ప్రయత్నం! ట్రై అండ్ ట్రై అండ్ ట్రై అన్నాడు శాస్త్రకారుడు. చూద్దాం. మనదంతా ఏసీ—డిసి వ్యవహారమే కదా. పడితే పడుతుంది. లేకపోతే లేదు".

సరిగ్గా పది గంటలకి ఆ అమ్మాయి మా 'వింగ్'కి రావడం తన అపాయింట్‌మెంటు ఆర్డర్సు మా ఆఫీసరికి ఇవ్వడం, తనకి కేటాయించిన సీట్లో కూర్చోడం— అంతా మా కళ్ళముందే జరిగిపోయాయి. సూరిగాడు చెప్పింది నిజం! ఆ అమ్మాయి మామూలు అందంగా కాదు— అద్భుతంగా ఉంది. పొడుగాటి జడ, పెద్ద పెద్ద కళ్ళూ, పల్చటి పెదవులూ, పచ్చటి శరీరచ్ఛాయ— ఇక మిగతా శరీరాన్ని ప్రబంధకవులు మాత్రం వర్ణించ గలిగేటట్టుగా ఉంది. ఏ భట్టుమూర్తో అయితే ఆమెను చూసి వెంటనే గంటం పుచ్చుకుని—

'లలనా జనాపాంగవలనా

వసుధనంగ నాభికాంభంగ దోఃప్రవ ంగ...' అంటూ వర్ణన అందిపుచ్చుకునే వాడు. ఆమె నడకని చూస్తూ—

'మందయానము నేర్పునిందింది రాజీవ రాజీవ రాజన్మరాళరాజీ...' అంటూ తన్మయత్వానికి లోనయ్యేవాడు.

ఆమె తన సీట్లో కూర్చున్నాక ఓసారి చుట్టూ కలయచూసింది. నావైపు చూసినప్పుడు నేను పలకరింపుగా చిరునవ్వు నవ్వాను. ఆమె కూడా చిన్నగా నవ్వింది.

లంచ్ అవర్ వరకూ ఏమీ మాట్లాడలేదు ఆమె. మా ఆఫీసరు కూడా మహాబిజీగా ఉన్నాడేమో, ఆమెకి వెంటనే ఏ పనీ ఎలాట్ చెయ్యకుండా—

"అమ్మా— మీరు కాస్త రావుగార్ని అడిగి పని గురించి తెలుసుకుంటూ ఉండండి. ఇక్కడి పని ఏమీ పెద్ద కష్టం కాదు. ఓ వారంరోజుల్లో మీకు పూర్తిగా అర్థమయిపోతుంది" అని తన పనిలో తను మునిగిపోయాడు.

ఆమె నా దగ్గరకొచ్చింది. నేను ఎవరితోనూ అతిగా చనువుతీసుకుని మాట్లాడే వాణ్నికాను. స్నేహం చెయ్యడానికి నేను చాలా సమయం తీసుకుంటాను. కాని ఒకసారి స్నేహం కలిసాక యిక జీవితాంతం వారితో ఆ స్నేహాన్ని కొనసాగిస్తాను. స్త్రీలైనా, పురుషులైనా యిదే నా సూత్రం. తొందరపడి పరిచయాలు పెంచుకోడం, తీరిగ్గా విచారించడం లోకంలో చాలామంది చేస్తూనే ఉంటారు. అందుకే యీ లోకంలో నాకు ఉన్న స్నేహితుల్ని వేళ్ళమీద లెక్కపెట్టవచ్చు.

చందన— ఆ అమ్మాయి పేరు— నిజంగా చాలా చురుకైనది. ఏ సంగతేనా ఒకసారి చెప్పగానే ఆకళింపు చేసుకుంటుంది. ఏదేనా అర్థంకాకపోతే నిర్భయంగా అడిగి తెలుసుకుంటుంది. అందువల్ల దాదాపు వారంరోజుల్లో ఆమె 'వర్క్' కూలంకషంగా నేర్చుకుని స్వంతంగా పనిచెయ్యడం ప్రారంభించింది. సూరిగాడు ఏడేళ్ళయింది ఆఫీసులో చేరి. యిప్పటికీ ఏదైనా 'నోటు' సబ్మిట్‌చెయ్యాలంటే నా దగ్గరకో, అవతలి సీటు నారాయణరావు దగ్గరికో పోతాడు. ఆ విషయంలో వాడికి సిగ్గూ, అభిమానం ఇలాంటివి ఏవీలేవు. నాలుగు రోజులాగితే కొత్తగా చేరిన చందన దగ్గరికి కూడా ఏదో పని విషయంలో సహాయం అర్థించడానికి వెనకాడడు.

రోజులు గడుస్తున్నాయి. రోజుకో స్పాట్‌న్యూస్ మా సూరిగాడు చెబ్తూనే ఉన్నాడు.

"గురూగారూ యీరోజు పేపర్ చూశారా— జపాన్‌లో నూట యిరవైయ్యేళ్ళ ముసలాడు చెప్పేట్ట తన ఆయుర్దాయానికి కారణం— రోజుకి ఇరవై నుంచి ఇరవై అయిదు కప్పుల 'టీ' తాగుతాట్ట, పదండి సార్ క్యాంటీన్‌కి వెళ్ళి చెరో అరకప్పూ 'టీ' తాగుదాం" అంటాడు ఓరోజు.

"మీకు తెలుసా గురూగారూ, కంప్యూటర్కి కూడా సరిగ్గా సరిపోయే భాష సంస్కృతంట!"

"'పే' కమిషన్ మాట దేవుడెరుగు, కనీసం ఇంటెరిమ్, రిలీఫైనా యిచ్చేటట్టు లేదు గురూగారూ గవర్నమెంటు" ఇలా రోజుకొక న్యూసు చెబుతుంటాడు సూరి.

ఉన్నట్టుండి ఓరోజున—

"గురూగారూ, మన చందన ఎవడితోనో ఎఫయిర్ నడుపుతోంది. ఈమె కాస్ట్‌వేరూ, వాడి కాస్ట్ వేరూ— వెధవ! నల్లగా ఎలా ఉన్నాడో తెలుసా? దొండపండూ కాకిముక్కూ సామెత తెలుసు కదా, సరిగ్గా అలా ఉన్నారు యిద్దరూనూ. నిన్న సాయంత్రం ట్యాంక్‌బండ్ మీద కన్పించేరు" ఆశాభంగంతో కోపంగా అన్నాడు సూరి.

"చూడు సూరీ అది ఆమె వ్యక్తిగత విషయం— మనకెందుకు చెప్పూ— అయినా నీకొచ్చిన నష్టమేమంటట?!" నేను సున్నితంగా మందలించేను.

"అవును గురూగారూ, మీకేమీ అక్కర్లేదు, సన్యాసం పుచ్చుకున్న వాళ్ళలాగా మాట్లాడతారు. నాతో స్నేహం చెయ్యకపోతే పోయింది. నాకందుకు విచారం లేదు. కానీ చూస్తూ చూస్తూ ఆ కాకి వెధవనెలా లవ్ చేసింది సార్. చూస్తూంటే కడుపు తరుక్కుపోతోంది!!"

చందనకోసం ఆ నల్లటి అబ్బాయి రెండుమూడుసార్లు ఆఫీసు వదిలే టైముకి రావడం— తన మోటార్ సైకిల్ మీద ఆమెనెక్కించుకుని వెళ్ళడం నేను కూడా చూశాను.

నల్లగా ఉన్నాడు కానీ ఆ కుర్రాడు చాలా స్మార్ట్‌గా ఉన్నాడన్పించింది నా కళ్ళకి. మంచి పొడగరి, చిన్నదైన దట్టమయిన జుట్టూ, ఎప్పుడూ 'డబుల్ బుల్' లాంటి ఖరీదయిన షర్టులూ, బోంబే డయింగ్ ట్రౌజర్సూ, ఏషన్ షూనూ — ఏదో మంచి ఉద్యోగమే అనుకున్నాను.

"గురూగారూ, యీ సంగతి తెలుసా? చందన యింట్లో వాళ్ళకి ఆ కుర్రాడంటే యిష్టం లేదట. పెళ్ళికి ఒప్పుకున్నారు కారట. యిప్పుడుంటుంది అసలు మజా...!" సాడిస్టిక్ ఆనందంతో కళ్ళుమెరుస్తూ అన్నాడు సూరి ఓరోజు.

"అమ్మాయికీ, అబ్బాయికీ యిష్టమయిన తర్వాత పెద్దవాళ్ళు ఒప్పుకోకపోతే మాత్రమేం? ఏ రిజిస్ట్రారాఫీసులోనో పెళ్ళిచేసుకుంటారు. యీరోజుల్లో యిలా ఎన్ని పెళ్ళిళ్ళు జరగడం లేదు. అయినా నీకెందుకు అంత ఆనందం?" అన్నారు నారాయణరావుగారు.

తర్వాత కొద్దిరోజుల్లోనే చందనకీ, ఫ్రాన్సిస్‌కి రిజిస్ట్రారాఫీసులో చాలా నిరాడంబరంగా జరిగిపోయింది పెళ్ళి. నారాయణరావుగార్నీ, నన్నూ పిల్చింది చందన— సూరిగాడు లేకుండా చూసి.

ఆరోజు పనికట్టుకుని మాకు తోచినదీ, మా పర్సులు తట్టుకోగలిగిందీ అయిన ఓ 'బహుమతి'కొని యిద్దరం వెళ్ళాం పెళ్ళికి. చందన ఎంతో ఆనందించింది మమ్మల్ని చూసి—

"చాలా థాంక్స్ రావుగారూ, మీరూ నారాయణరావుగారూ వచ్చారు— చాలా సంతోషం. ప్లీజ్ మీట్ మై హజ్‌బెండ్ మిస్టర్ ఫ్రాన్సిస్, ఫ్రాన్సిస్ వీరు రావుగారూ, ఆయన నారాయణరావుగారూ. ఆఫీసులో నేను వర్క్ నేర్చుకుంది వీరిదగ్గరే." అతను మా యిద్దరితో కరచాలనం చేశాడు నవ్వుతూ. అప్పుడు చూశాను అతనిలో ప్రత్యేకతని. అతని నవ్వు! ఎంత నిర్మలంగా ఉంది! ఎంత ప్రశాంతంగా ఉంది! అతని హృదయం ఎంతో నిర్మలమయినదీ ఎంతో విశాలమయినదీ అని ఎందుకో అతన్ని చూడగానే అన్పించింది.

ఫ్రాన్సిస్ ఓ పెద్ద ప్రైవేట్ కంపెనీలో కంప్యూటర్ యింజనీర్‌ట. ఎనిమిది వేలో తొమ్మిది వేలో జీతంట. చాలామంచి వాడుట. చెడు అలవాట్లేమీ లేవుట — వాళ్ళవాళ్ళు అందరూ నాన్ వెజిటేరియన్ వంటకాలు తింటారుట కానీ యితడు మాత్రం తినడుట. ఇలా చాలా చాలా సంగతులు తన భర్త గురించి చెబ్తూ ఉండేది చందన అతని ప్రవర్తన వచ్చినప్పుడల్లా.

కాలం గడుస్తూంది. ప్రతిరోజూ క్రమం తప్పకుండా ఆఫీసు వదిలే సమయానికి ఫ్రాన్సిస్ రావడం— చిలకాగోరింకల్లాగా చందనా అతనూ, కల్సి వెళ్ళిపోడం జరుగుతూనే ఉంది. కొన్ని నెలలయిన తర్వాత చందన నన్ను తన యింటికి డిన్నర్‌కి పిలిచింది. ముందు మొహమాటపడినా, వాళ్ళ కాపురం ఎలా ఉందో ప్రత్యక్షంగా చూద్దామన్న కుతూహలంతో ఒప్పుకుని వెళ్ళాను ఓ సాయంత్రం.

అంత చక్కటి భార్యాభర్తల్ని, అంతగా ఒకర్ని ఒకరు ప్రేమించే వ్యక్తుల్ని వాళ్ళనే చూశాను. ఆ సాయంత్రం చాలా ఆహ్లాదంగా గడిచింది నా జీవితంలో.

ప్రతి ఆడపిల్లా తనకెలాంటి భర్త కావాలని ఆశిస్తుందో అలాంటి ఆదర్శ భర్తలా ఉన్నాడు ఫ్రాన్సిస్.

మర్నాడు ఆఫీసుకి వచ్చేసరికి సూరిగాడు నారాయణరావుగారితో చెబ్తున్నాడు వెనుకనుంచి వస్తున్న నన్ను చూసుకోకుండా—

"గురువుగారూ, మన రావుగారు చూశారా, అంత పెద్ద మనిషిలా ఉంటారా— మెల్లిగా చందన యింటికి డిన్నర్లకి వెళ్ళడం వరకూ నడిపించారు వ్యవహారం. తక్కువ్వాళ్ళు కాదండీ బాబూ, ఇంకా ఏంటో అనుకున్నాను".

నారాయణరావుగారూ నేనూ ఒకరి కళ్ళల్లోకి ఒకరం చూసుకుని నవ్వుకున్నాం.